
సాక్షి ఒడిశా

ఆదివారం । 13 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ. 7,41,611లు వచ్చాయని అధికారులు తెలిపారు.



విజ్ఞానం.. వికాసం

సరస్వతీ శిశుమందిర్‌లో శనివారం విజ్ఞాన మేళా ప్రారంభమైంది. - 8లో



ప్రజల చెంతకు పథకాలు

ప్రజలకు పథకాలు చేరువ చేయాలని కలెక్టర్ దివ్యాజ్యోతి పరిడా కోరారు. - 8లో

ఆరు అడుగులు.. 17 కేజీలు



మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఎన్‌ఏసీలో 9వ వార్డు రాణి వీధిలో శనివారం ఆరు అడుగుల కొండచిలువ హల్‌చల్ చేసింది. రాజు అనే వ్యక్తి ఇంటి పెరటిలో ఉన్న కోళ్లను తిండి కదల్లేకపోయింది. గమనించిన స్థానికులు స్నేక్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించగా.. రాజేంద్ర ఖార వచ్చి కొండచిలువను పట్టుకున్నారు. దీని బరువు 17 కేజీలు ఉన్నట్లు తెలిపారు. అనంతరం బలిమెల అటవీప్రాంతంలో విడిచిపెట్టారు.

– మల్కన్‌గిరి

వన్యప్రాణం.. రక్షణ అవశ్యం

నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండిలోని డీర్ పార్కును మినీ జూగా మార్చాలని స్థానిక ఎంపీ రమేష్ చంద్ర మజ్జి శనివారం న్యూఢిల్లీలోని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌కు విన్నవించారు. జాతీయ రహదారిను ఆనుకుని ఉన్న ఈ పార్కుకు పర్యాటకుల ఆదరణ బాగా ఉందని, అనేక వన్యప్రాణులకు ఇక్కడ రక్షణ కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా జింకల పునరుత్పత్తి పెరిగి వాటి సంఖ్య పెరిగిందని, ఈ నేపథ్యంలో మినీ జూగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. – కొరాపుట్



మాతృత్వపు మధురిమ



తల్లిగా మారినప్పుడే మహిళ పరిపూర్ణమవుతుందంటారు. అయితే ఈ అదృష్టం కొంతమందికి దక్కదు. పిల్లలు లేక ఎంతోమంది కుమిలిపోతుంటారు. అలాంటి వారికి దత్తత ప్రక్రియ కాస్త ఊరటనిస్తుంది. ఈ నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన దంపతులకు శనివారం పర్లాకిమిడి జిల్లా పోష్య సంతాన దత్తత కేంద్రం నుంచి ఇద్దరు శిశువులను కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అప్పగించారు. దీంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది.

– పర్లాకిమిడి

న్యూస్‌రీల్

కాంగ్రెస్ సమితులకు అధ్యక్షుల నియామకం

రాయగడ: జిల్లాలోని ఎన్‌ఏసీ, మున్సిపాలిటీ, సమితుల్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను పార్టీ అధిష్టానం శనివారం ప్రకటించింది. రాయగడ సమితి కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా గడిగ బచిలి, రాయగడ మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా మనోజ్‌కుమార్ రౌథొ, కాసీపూర్ సమితికి అంగద్ నాయక్, బిసంకటక్‌కు కృష్ణ నానక్, మునిగుడకు నీలాంబర్ భిభార్, కొలనారకు ఐ.గోవర్ధనరావు, కళ్యాణసింగుపూర్‌కు సీహెచ్ నాగేశ్వరరావు, గుణుపూర్ సమితికి లివింగ్‌స్టోన్ లిమ్మ, మున్సిపాలిటీకి ఘాసీరథం బవురి, రామనగుడ సమితికి బచానిధి బెహరా, పద్మపూర్‌కు సాహెబ్ సబర్, గుడారి సమితికి భాస్కర జగరంగ, గుడారి ఎన్‌ఏసీకి ప్రమోద్‌కుమార్ పతి, చంద్రపూర్‌కు జార్జ్ క్రిషకలు అధ్యక్షులుగా నియమితులైనట్లు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యాలయ కార్యదర్శి బైద్యనాథ స్వాయి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతూన్న అధ్యక్షుడు భిబుతి భూషణ్ జెనా

బరంపురం: దక్షిణ ఒడిశాలో అన్ని రంగాల్లో కేంద్ర బిందువుగా నిలిచిన గంజాం జిల్లాలో బీజేపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు భిబుతి భూషణ్ జెనా పిలుపునిచ్చారు. శనివారం నెహ్రూనగర్ 10వ లైన్‌లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులంతా కలిసికట్టుగా పనిచేసి 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ పవనాలు వీస్తున్నాయని, ఒడిశా ప్రజలు కూడా ఆదరిస్తారనే నమ్మకముందన్నారు. సమావేశంలో కార్యదర్శి మదన్‌మోహన్ పాత్రో, సునీల్ సాహు, కైలాస్ సడంగి జిల్లా బ్లాక్ అధ్యక్షుడు, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించాలి



ఏడీఎంతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

కొరాపుట్: దసరా పాద రోడ్డు విస్తరణ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని నబరంగ్‌పూర్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం నబరంగ్‌పూర్ కలెక్టర్‌ను కలిసేందుకు మున్సిపల్ చైర్మన్ కును నాయక్ నేతృత్వంలో బృందం వెళ్లింది. కలెక్టర్ భువనేశ్వర్ పర్యటనలో ఉన్నారని తెలిసి ఏడీఎం మహేశ్వర్‌నాయక్‌ను కలిసి సమస్య వివరించారు. జిల్లా కేంద్రంలోని బస్తి ప్రాంతం దసరా పాద మీదుగా జిల్లా కేంద్ర ఆస్పత్రి వరకు రోడ్డు విస్తరణ చేపట్టారని, రోడ్డును ఆనుకుని ఉన్న ఒకవైపు వారికి వారం రోజుల్లో ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారని, దాంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు వైపులా విస్తరణ చేస్తే నష్టం తక్కువగా ఉంటుందన్నారు. అదే విధంగా, నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉషారాణి, ఏ.సతీష్, ఐ.మురళీకృష్ణ, నాగేంద్ర పట్నాయక్, షర్మీష్టా దేవ్ పాల్గొన్నారు.

కూలిన విమానాశ్రయ ప్రహరీ



కూలిపోయిన ప్రహరీ

భువనేశ్వర్: కలహండి జిల్లా భవానీపట్న ఉత్కెళ ఎయిర్‌స్ట్రిప్ ప్రాంతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చెందింది. త్వరలో ఇక్కడి నుంచి భువనేశ్వర్‌కు విమానయాన సౌకర్యం అందుబాటులోకి రానుందని ఇటీవల ప్రకటించారు. ఇంతలో విమానాశ్రయం ప్రహరీ కుప్పకూలింది. ఈ నెల 15న విమానాశ్రయం ప్రారంభించేందుకు యోచిస్తున్న తరుణంలో ఇలా జరగడం సర్వత్రా చర్చనీయాంశమైంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్, చీఫ్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఏఎస్ఓ), ఎయిర్‌పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), సీఐఎస్ఎఫ్ నోడల్ అధికారుల నేతృత్వంలోని ప్రత్యేక బృందం గత నెల ఎయిర్‌స్ట్రిప్‌ను సందర్శించి సౌకర్యాలు, ఇతర భద్రతా ప్రామాణికల్ని అధికారుల సమక్షంలో సమీక్షించింది. దీని ఆధారంగా ఉత్కెళ ఎయిర్‌స్ట్రిప్‌కు 2బి లైసెన్స్ మంజూరు చేసే సౌకర్యాలపై బృందం సంతృప్తి వ్యక్తం చేసింది.

ప్రతిభకు పురస్కారం





నందిని మహంతి



మానస రంజన్ ప్రధాన్



ప్రశాంత కుమార్ సాహు



ప్రభాత్ కుమార్ బిశ్వాల్

- దర్యాప్తులో రాష్ట్ర పోలీసుల దక్షత
- కేంద్ర హోం మంత్రి పతకానికి నలుగురు ఎంపిక

భువనేశ్వర్: నేర సంబంధిత కేసుల దర్యాప్తులో రాష్ట్ర పోలీసులు సత్తా చాటుకున్నారు. ఏటా ప్రదానం చేసే కేంద్ర హోం మంత్రి పతకానికి ఈ సారి రాష్ట్రం నుంచి నలుగురు పోలీసులు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో మొత్తం 140 మందిని ఎంపిక చేయగా వారిలో మన రాష్ట్రం కటక్ యూపీడీ ఇన్‌స్పెక్టరు నందిని మహంతి, సుందరగడ్ డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ మానస రంజన్ ప్రధాన్, గంజాం ఇన్‌స్పెక్టర్ ప్రశాంతకుమార్ సాహు, సుందరగడ్ డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్ ప్రభాత్ కుమార్ బిశ్వాల్ కేంద్ర హోం మంత్రి పోలీసు పతకానికి ఎంపికైన వారిలో ఉన్నారు. నేర పరిశోధనలో కీలక పాత్ర పోషించే పోలీసులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2018 నుంచి ఈ పతకాలను ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది సీబీఐ నుంచి 15 మంది, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) నుంచి 12 మంది, ఉత్తరప్రదేశ్ నుంచి 10 మంది, కేరళ, రాజస్థాన్‌ల నుంచి 9 మంది చొప్పున, తమిళనాడు నుంచి 8 మంది, మధ్యప్రదేశ్ నుంచి ఏడుగురు, గుజరాత్ నుంచి ఆరుగురు, ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత రాష్ట్రాల మరికొందరు ఎంపికయ్యారు. వీరిలో 22 మంది మహిళా పోలీసులు కూడా ఉన్నారు. అందులో ఒకరు రాష్ట్రానికి చెందిన ఏకైక మహిళ అధికారి నందిని మహంతి కావడం విశేషం.

క్రైం కార్నర్

పాముకాటుకు తల్లీకొడుకుల బలి



బృందా (ఫైల్)



బిజయ్ (ఫైల్)

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి చంద్రగిరి పంచాయతీ సిపిలిజొల్ గ్రామంలో పాముకాటుతో తల్లీకుమారులు మృతిచెందారు. బృందాబిసి(32), ఆమె కొడుకు బిజయ్ బిసి (9) ఎప్పట్లాగే శుక్రవారం వారు రాత్రి భోజనాలు చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి సమయంలో విష సర్పం ఇంటిలోకి ప్రవేశించి ముందుగా బిజయ్‌ను, పక్కనే ఉన్న బృందాను కాటువేసింది. మెలకువ తెచ్చుకున్న బృందా కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చారు. పాము కాటువేసినట్టు గమనించి చంద్రగిరి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించేలోపే ఇద్దరూ ప్రాణాలు విడిచారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

వలస కూలీ మృత్యువాత



ప్రశాంత్ (ఫైల్)

మల్కన్‌గిరి: పొట్టకూటికి పొరుగు రాష్ట్రం వెళ్లిన మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని 119 కాలానీకు చెందిన ప్రశాంత్ ఖోరా (32) కుప్పకూలి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంత్ కూలి పనులు చేస్తుండేవాడు. లేబర్ కార్డు లేకపోవడంతో స్థానికంగా పని దొరక్క భార్యతో కలిసి ఆంధ్రప్రదేశ్ వలస వెళ్లాడు. అక్కడ శుక్రవారం పనిచేస్తుండగా కుప్పకూలి మృతిచెందాడు. మృతదేహం తరలించేందుకు సహకరించాలని మృతుడి భార్య యజమానిని వేడుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో ప్రశాంత్ తండ్రి మల్కన్‌గిరి జిల్లా లేబర్ ఆఫీసర్ శరత్ చంద్ర పాణిగ్రాహికు సమాచారం అందించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

జయపురం: హర్యానా రాష్ట్రానికి గంజాయి తరలిస్తున్న మహిళతో పాటు ఇద్దరు మైనర్లను అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి శనివారం వెల్లడించారు. అరెస్టయిన మహిళ హర్యానా రాష్ట్రం ఫతేహబాద్ నివాసి లెఫ్టినెంట్ రుతాస్ భార్య ధనపతి(33)గా తేలింది. ఆమెతో పాటు పట్టుబడిన ఇద్దరు మైనర్లు 14, 15 ఏళ్ల వారని చెప్పారు. గంజాయి విలువ రూ.3.6 లక్షలు ఉంటుందని వెల్లడించారు. శుక్రవారం రాత్రి గగణాపూర్ పోలీసు పంటి అధికారి సబ్ ఇన్‌స్పెక్టర్ రాజకిశోర్ బారిక్, ఎ.ఎస్.ఐ బసంత నాయిక్‌లు సిబ్బందితో కలిసి బరిణిపుట్ ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా వీరు పట్టుబడ్డారు. హర్యానా నుంచి వచ్చిన వీరు రెండు నెలలుగా ఇక్కడే నివాసముంటున్నట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేసినట్లు తండి వెల్లడించారు.

విదేశీ మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లతో నిందితుడు

మల్కన్‌గిరి: బలిమెల ఎన్‌ఏసీలో బలిమెల –మల్కన్‌గిరి ప్రధాన రహదారిలో ఐఐసీ దీనేశ్ పట్నాయక్ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా శుక్రవారం రాత్రి 9 గంటలు సమయంలో ఓ వ్యక్తి బ్యాగ్‌తో అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని ఆపి తనిఖీ చేయగా విదేశీ మద్యం బాటిళ్లు గుర్తించారు. నిందితుడు కలిమెల సమితి ఎం.వి.79 గ్రామానికి చెందిన చేందిన సుఖ్‌దేవ్ ఖీలోగా గుర్తించారు. 11.8 లీటర్ల మద్యం ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

పూరీ వెళ్లొచ్చేసరికి చోరీ..!



ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్‌టీం

రాయగడ: గుణుపూర్‌లోని జగనాథనగర్ కాలనీలో నివాసముంటున్న శివరాం పండా ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని చూసి తాళాలను విరగ్గొట్టి రూ.6.80 లక్షల నగదు, 15 తులాల బంగారు ఆభరణాలు, విలువైన సామగ్రి దోచుకుపోయారు. శివరాం తన కుటుంబ సభ్యులతో కలిసి వారం కిందట పూరీ క్షేత్రానికి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున ఇంటికి చేరుకున్నారు. తలుపు తాళాలు విరిగి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి శనివారం ఆదర్శ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. రాయగడ నుంచి డాగ్ స్క్వాడ్ చేరుకుని ఆరా తీశారు. దుండగులను పట్టుకుంటామని ఐఐసీ ఉత్తమకుమార్ సాహు తెలిపారు.

2 వేల లీటర్ల సారా ధ్వంసం



సారా బట్టీపై దాడులు చేస్తున్న పోలీసులు, ఎక్సైజ్ అధికారులు



పట్టుబడిన నిందితులతో పోలీసులు

బరంపురం: గంజాం జిల్లా అస్కా పోలీసుస్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తయారు చేస్తున్న రెండు సారాబట్టీలపై పోలీసు, ఎక్సైజ్ అధికారులు దాడుల చేపట్టినట్లు ఐఐసీ అధికారి ప్రశాంత్ కుమార్ సాహు శనివారం తెలిపారు. పాకలపల్లి, ఈరగుల్లా గ్రామాల్లో దాడులు చేపట్టి 2 వేల లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు చెప్పారు. మరో 280 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 13 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. తయారీ సామగ్రి, పాత్రలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పెన్షన్ కాదు ఆపరేషన్!



మందులు చూపిస్తున్న గాంగ దురువ

- పింఛన్ ఇస్తానని మూగ యువకుడిని తీసుకెళ్లిన ఆశా వర్కర్
- కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్స చేశారని బాధితుడి ఆవేదన

మల్కన్‌గిరి: పింఛన్ ఇస్తామని ఓ యువకుడిని తీసుకెళ్లిన ఆశ వర్కర్.. కుటుంబ సంక్షేమ శస్త్రచికిత్స చేసిన వైనం మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితిలో వెలుగుచూసింది. బాధిత కుటుంబం తెలిపిన వివరాల మేరకు.. మత్తిలి సమితి మొహిపోధర్ పంచాయతీ అంబగూడకు చెందిన గాంగ దురువ(26) పుట్టుకతో మూగ. ఇంకా వివాహం కాలేదు. ఈ నెల 3న గ్రామానికి చెందిన ఆశా వర్కర్ గాంగదరువ ఇంటికి వచ్చింది. పెన్షన్ ఇప్పిస్తానని చెప్పి మత్తిలి సమితి ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లింది. పిల్లలు పుట్టకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించింది. ఇంటికి మందులతో తిరిగి వచ్చిన కుమారుడిని తల్లి చూసి.. ఎందుకు మందులు వేసుకుంటున్నావని ప్రశ్నించింది. జరిగిన విషయం చెప్పడంతో ఆమె గ్రామస్తులతో కలిసి ఆస్పత్రికి వెళ్లి వైద్యులను నిలదీసింది. తన బిడ్డకు పిల్లలు పుట్టకుండా చేసిన ఆశ వర్కర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ విషయమై మల్కన్‌గిరి జిల్లా వైద్యాధికారి ప్రఫుల్ల కుమార్ నాందో వద్ద ప్రస్తావించగా.. విచారణ నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రి నుంచి బృందాన్ని మత్తిలి పంపించామన్నారు. ఆశ వర్కర్ తప్పు చేసినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉత్సాహంగా వక్తృత్వ పోటీలు



విద్యార్థిని ఉపన్యాసాన్ని వింటున్న న్యాయనిర్ణేతలు

రాయగడ: పట్టణ సమీపంలోని జేకే పేపర్ మిల్లు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 56 పాఠశాలలకు చెందిన 711 మంది విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ముందుగా జేకేపేపర్ మిల్ హెచ్ఆర్ శాఖ సందీప్ పాఢి ముఖ్య అతిథిగా హాజరై పోటీలు ప్రారంభించారు. సబ్ జూనియర్ విభాగంలో ఆకృతి పాఢి, సృజనా ప్రసాద్, శివరోహిణి తొలి మూడు స్థానాల్లో నిలవగా బిట్టు ప్రియ సాబొరొ ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. జూనియర్ విభాగంలో ఆశీర్వాద్ దొర, సాయి శ్రీదాస్, సరస్వతి సాహులు తొలి మూడు స్థానాల్లో నిలవగా, మున్న కొండగిరి ప్రోత్సాహక బహుమతి కైవసం చేసుకున్నారు. సీనియర్ విభాగంలో సునయన సాహు, సరస్వతి సాహు, పింకి మండంగి తొలి మూడు స్థానాలు సాధించారు. జేకేపూర్ క్లబ్‌లో ఆగస్టు 15న వీరికి బహుతులు అందజేస్తారు. కార్యక్రమం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గదదీష్ చంద్ర దొర, ప్రవీన్‌కుమార్ మహాపాత్రో, రాజ్ కుమార్ సాహు పాల్గొన్నారు.

సుశాంత్ అమర్‌రహే!



ఆనందపూర్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం



సుశాంత్ ఖుంటియా (ఫైల్)

- మావోయిస్టుల ఎదురుకాల్పుల్లో మృతిచెందిన సీఆర్‌పీఫ్ జవాన్ సుశాంత్ ఖుంటియా
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

భువనేశ్వర్: సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) అమర జవాను సుశాంత్ ఖుంటియా భౌతికకాయానికి ప్రభుత్వ లాంఛనాలతో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. స్వగ్రామం కెంజొహర్ జిల్లా ఆనందపూర్‌లో శనివారం అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర సాగింది. గ్రామస్తులు భారీగా చేరుకుని భౌతికకాయాన్ని శ్మశాన వాటికకు తరలించారు. వీర జవాన్ సుశాంత్ అమర్ రహే నినాదాలు మారుమోగాయి. సుశాంత్ మృతిపట్ల గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఈయన 2012 నుంచి జవానుగా పని చేస్తున్నారు.

ఛాతీపై కాల్పులు..

పొరుగు రాష్ట్రం జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లా టోంటో పోలీసు ఠాణా పరిధిలోని అడవిలో శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ – మావోయిస్ట్ సంస్థ సెంట్రల్ కమిటీ, మిసిర్ బెస్రా స్క్వాడ్‌తో జరిగిన ఎదురు కాల్పుల్లో సుశాంత్‌తో పాటు మరో జవాన్ మున్నాలాల్ గాయపడ్డారు. సత్వర చికిత్స కోసం వీరిని విమానంలో రాంచీకి తరలించారు. ఛాతీ దగ్గర కాల్పుల జరగడంతో సుశాంత్ మృతి చెందారు. మున్నాలాల్ కోలుకుంటున్నారు.

నాలుగు నెలల కిందటే వివాహం..

అమర జవాను సుశాంత్‌కు నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. ఈయన భార్యకెంజొహర్ తెల్‌కోయ్ ప్రాంతంలో ఏఎన్ఎం కార్యకర్తగా సేవలందిస్తున్నారు. సీఆర్‌పీఎఫ్‌లో పనిచేసిన అతని అన్నయ్య కొన్నేళ్ల క్రితం మరణించాడు. మరొక సోదరుడు క్యాన్సర్‌తో మరణించారు. అతని తండ్రి గత ఏడాది చనిపోయారు. తల్లి అనారోగ్యంతో భువనేశ్వర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు మృతుని సన్నిహిత వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

చిన్న దుకాణదారులకు రుణమేళా



రుణమేళా నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: జయపురం మునిసిపాలిటీ పరిధిలో బడ్డీ, తోపుడు బళ్ల వ్యాపారుల కోసం శనివారం కౌన్సిల్ సమావేశ మందిరంలో రుణమేళా నిర్వహించారు. ప్రధానమంత్రి యశ్వనిధి పథకంలో భాగంగా రోడ్డు పక్కన చిన్న దుకాణాలలో వ్యాపారం చేసేవారికి రూ.10 వేలు రుణాలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయక్ మాట్లాడుతూ పథకంలో భాగంగా ఇంతవరకు 365 మందికి బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయని వెల్లడించారు. రానున్న రోజులలో ఇతర దుకాణదారులకు రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నరేంద్రకుమార్ మహంతి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు స్వాతంత్య్ర దినోత్సవ పోటీలు


పోటీలో పాల్గొన్న విద్యార్థిని

బరంపురం: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శనివారం ఉప జిల్లా పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో సబ్-కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సుమారు 30 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన చెందిన చిన్నారులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. విజేతలకు వచ్చే ఆగస్టు 15న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు డీఆర్‌పీ రబికుమార్ బెహరా తెలిపారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేత సుదీప్ సాహు తదితరులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఫాస్టర్లు

చీపురుపల్లి: మణిపూర్‌లో మారణకాండను నిరసిస్తూ ఫాస్టర్స్ ఫెలోషిప్ సేవకుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న దారుణాలను కేంద్ర ప్రభుత్వం అరికట్టాలని, అక్కడ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాలకు చెందిన ఫాస్టర్లు, జిల్లా మైనారిటీ పట్టభద్రుల అధ్యక్షుడు ఆశాజాన్ పాల్గొన్నారు.

డీపట్టాభూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్

వేపాడ: మండలంలోని వీలుపర్తి రెవెన్యూలో డీపట్టాభూములను తహసీల్దార్ ప్రసన్నకుమార్ శనివారం పరిశీలించారు. వీలుపర్తి రెవెన్యూలో డీపట్టా భూముల సమస్యపై పలు దినపత్రికల్లో వచ్చిన కథనాలపై ఆర్డీఓ సూర్యకళ ఆదేశాలమేరకు భూములను పరిశీలించామని చెప్పారు. భూములను పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. జిల్లా అధికారులకు నివేదిక అందిస్తామని తహసీల్దార్ తెలిపారు. మండల సర్వేయర్ అప్పలనాయుడు ఆయన వెంట ఉన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా


జాతీయ జెండాలను పంచిపెడుతున్న బీజేపీ నాయకులు

శృంగవరపుకోట: ప్రతీ ఇంటిపై ఆదివారం నుంచి ఈ నెల 15వ తేదీ స్వాతంత్య్ర దినోత్సవం వరకు జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ నాయకులు డి.సూర్యారావు, దాశెట్టి దాశరథి ప్రజలకు సూచించారు. మండలంలో గదబూరు గ్రామంలో గిరిజనులకు జాతీయ జెండాలను శనివారం పంచిపెట్టారు. దేశ భక్తి, జాతి ఐక్యత,సమగ్రత జాతీయ భావంపై అవగాహన కల్పించారు. హర్ ఘర్ తిరంగా లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాలమేరకు గ్రామాల్లో జాతీయ పతాకాలను పంచిపెడుతున్నామని నాయకులు తెలిపారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

చీపురుపల్లి: స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని బెజ్జిపురం యూత్ క్లబ్ నేతృత్వంలో పట్టణంలోని బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 'బాలలకు అందుబాటులో న్యాయం' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను శనివారం నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతల పేర్లను ప్రకటించారు. వీరికి స్వాతంత్య్ర దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నామని నిర్వాహకులు తెలిపారు.

విజ్ఞానం.. వికాసం

- సరస్వతీ శిశు విద్యామందిర్‌లో విజ్ఞాన మేళా ప్రారంభం
- ఆకట్టుకున్న 150 ప్రదర్శనలు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు


పర్యావరణ పరిరక్షణ ప్రాజెక్టు


విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయనిర్ణేతలు


రోదసి విజ్ఞానంపై విద్యార్థులతో ముచ్చటిస్తున్న డాక్టర్ బి.సి.సాబత్


స్మార్ట్ సిటీ ప్రాజెక్టు


విద్యార్థుల మేధస్సును పరీక్షిస్తున్న న్యాయనిర్ణేతలు

పర్లాకిమిడి: స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్‌లో ఏర్పాటు చేసిన మున్సిపల్ స్థాయి విజ్ఞాన మేళాను కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మాజీ సంచాలకుడు డాక్టర్ బి.సి.సాబత్ శనివారం ప్రారంభించారు. జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పది పాఠశాలల నుంచి 150 సైన్సు ప్రాజెక్టులను ప్రదర్శించారు. చంద్రయాన్, పర్యావరణం, స్మార్ట్ సిటీ తదితర ప్రాజెక్టులు ఆకర్షణగా నిలిచాయి. విశ్రాంత బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి బాలకృష్ణ మిశ్ర, డాక్టర్ శుభ్రత్ పాణిగ్రాహి, అమూల్య పాణిగ్రాహిలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. గౌరవ అతిథులుగా జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ ఎ.రవికుమార్ విచ్చేశారు. సరస్వతీ శువిద్యా మందిర్ ప్రధాన అచార్యులు సరోజ్ కుమార్ పండా పర్యవేక్షకులుగా నిలిచారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు, గణపతి సాబత్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బినోద్ చంద్ర సాబత్ తెలిపారు.

బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుంది


జగన్నాథుని దర్శించుకున్న కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్

భువనేశ్వర్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఒడిశాలో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని, ఎవరితోనూ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ శనివారం స్పష్టం చేశారు. రాష్ట్ర పర్యటన పురస్కరించుకుని పూరీ జగన్నాథుని శనివారం దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆశాజనకమైన బలంతో బీజేపీ విజయం సాధించి ఒడిశాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, బిజూ జనతాదళ్ (బీజేడీ) మధ్య ఎటువంటి పొత్తు ఉండదన్నారు. తాము సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోగలమన్నారు. కాగా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల రాష్ట్ర పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఇరుపార్టీల వారు పొగడ్తల జల్లు కురిపించడం ప్రాముఖ్యతను సంతరించుకుంది. అమిత్ షా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించారు. రాష్ట్రానికి కేంద్రం ఇస్తున్న మద్దతుకు ముఖ్యమంత్రి నవీన్ కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంటులో ఇటీవల ప్రవేశ పెట్టిన ఢిల్లీ సర్వీస్ బిల్లుకు బీజేడీ మద్దతు ఇచ్చింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని రాష్ట్రంలో అధికార పక్షం బిజూ జనతాదళ్ వ్యతిరేకించి అండగా నిలిచింది. కాగా, రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో 147 అసెంబ్లీ స్థానాలు, 21 లోక్‌సభ స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేస్తుందని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సమాల్ స్పష్టం చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీకి ప్రజల మద్దతు లభించడం తథ్యమన్నారు. బీజేపీ సాధించే ఫలితాలు అందరినీ ఆశ్చర్యపరుస్తాయని అంతర్గత సర్వేలో తేలిందన్నారు.

ద్విచక్ర వాహన వేలం రేపు

గుర్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో 14వ తేదీన ద్విచక్ర వాహనం వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ హరిబాబునాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2021లో సారా తరలిస్తున్న కేసులో ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామని పేర్కొన్నారు. వాహనాన్ని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సమక్షంలో వేలం వేయనున్నామని, ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు.

17న గజపతినగరంలో..

దత్తిరాజేరు: మండలంలోని ఎస్.భూర్జవలస పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో మద్యం కేసులో సీజ్ చేసిన స్కూటీని ఈనెల 17న గజపతినగరం సర్కిల్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ రాజేష్ శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనవచ్చని చెప్పారు.

రెండు వార్డులు ఏకగ్రీవం

బొండపల్లి: మండలంలోని నాలుగు పంచాయతీ వార్డు మెంబర్ స్థానాలకు నిర్వహిస్తున్న ఉపఎన్నికల్లో రెండు వార్డులు ఏకగ్రీవం అయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు శనివారం తెలిపారు. మండలంలోని మరువాడ2 వార్డుకు దాసరి కాంత, ఒంపల్లి- 2 వ వార్డుకు దొంతల అప్పలనారాయణ ఒకొక్కరే నామినేషన్ వేశారని, వీరి నామినేషన్లను పరిశీలించిన తర్వాత ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ప్రకటించామని ఆర్ఓ తెలిపారు.

స్వాతంత్య్ర వేడుకలకు సన్నద్ధం


సిబ్బందికి సూచనలిస్తున్న కమాండర్ నిరధ్ కుమార్ పొలయి


జయపురం: మైదానాన్ని పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంతకుమార్

జయపురం: జయపురం సబ్ డివిజన్ స్థాయిలో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు విక్రమ క్రీడా మైదానం(దసరా పాడియ) ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలో సబ్ కలెక్టర్ ప్రశాంత కుమార్ పరిడ మైదానాన్ని సందర్శించి ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. వేదికను అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెరేడ్ సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసుబందోబస్తు నిర్వహించాలన్నారు. స్టూడెంట్ ట్రాఫిక్ వలంటీర్లు, వలంటీర్ల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు బీడీఓ మనోజ్‌కుమార్ నాయిక్, జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి, పట్టణ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ సంజయ కుమార్ మహంతి, ఆర్ అండ్ బీ జూనియర్ ఇంజనీర్ కుమార్ విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.


బరంపురం: బరంపురం రిజర్వ్ పోలీసుల కవాతు

సంబరాలకు రిహార్సల్

బరంపురం: స్వాతంత్య్ర దినోత్సవం నేపథ్యంలో బరంపురం ఉపఖండం పాలన ఆధ్వర్యంలో కళ్లికోట్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ, ఎర్వింగ్, స్కౌట్, నావీ, ఆర్మీ వింగ్ బృందాలు రిహార్సల్స్ చేశాయి. కమాండర్ నిరధ్‌కుమార్ పొలయి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కవాతు ఆకట్టుకుంది. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండర్ బిక్రామ్ రంజన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

చకచకా పర్లాకిమిడి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు


ఆధునీకరణ పనులు జరుగుతున్న దృశ్యం


స్టేషన్‌లో ప్రారంభమైన క్యాంటీన్

పర్లాకిమిడి: స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఐఆర్‌సీటీసీ లైసెన్సు పొందిన క్యాంటిన్‌ను ప్రారంభమయ్యింది. దీంతో ప్రయాణికులకు రైల్ నీరు, బిస్కెట్లు, స్నాక్స్ లభ్యమవుతున్నాయి. పర్లాకిమిడి రైల్వేస్టేషన్ ఆధునీకరణ, ప్లాట్ ఫారం ఎత్తు, వెయిటింగ్ హాలుపై ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు పలుసార్లు అందజేసిన వినతులకు స్పందించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పనులు వేగవంతం చేయాలని వాల్తేరు డివిజన్ డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ ఆదేశాలు ఇచ్చారు. దీంతో పనులు చకచకా సాగుతున్నాయి. వచ్చే ఈ ఏడాది చివరికల్లా అన్ని పనులు పూర్తవుతాయని డీఆర్‌ఎం తెలిపారు. మరోవైపు గుణుపురం రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం పనులు కూడా ప్రారంభమయ్యాయి. త్వరలో వీటిని పరిశీలించేందుకు డీఆర్‌ఎం వస్తారని ఎమ్మెల్యే నారాయణరావు తెలిపారు.

ప్రజల చెంతకు సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న కలెక్టర్ దివ్యాజ్యోతి పరిధా

బరంపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయాలని కలెక్టర్ దివ్యాజ్యోతి పరిధా కోరారు. శనివారం జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో గంజాం జిల్లా అభివృద్ధి ప్రణాళిక బోర్డు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అభివృద్ధి సమావేశం నిర్వహించారు. గంజాం జిల్లా అభివృద్ధి ప్రణాళిక బోర్డు చైర్మన్ రమేష్ చంద్రచావ్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గంజాం ప్రతి ఇంటికీ పైపులైన్ ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంత ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు భర్తీ చేయాలన్నారు. బరంపురం మహానగరంతో పాటు 22 బ్లాక్‌లు, మున్సిపాలిటీ, 16 ఎన్‌ఏసీ పరిధిలో రహదారుల నిర్మాణంతో పాటు కాలువల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వ ఆస్పత్రుల్లో బిజు ఆరోగ్య కల్యాణ పథకం పటిష్టంగా అమలు చేయాలన్నారు. సమావేశంలో ఛత్రపూర్ ఎమ్మెల్యే సుభాష్‌చంద్ర బెహరా, బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ప్రజా ఆరోగ్య శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీతారామ్ పండా తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి


సబ్ కలెక్టర్ ప్రభాత్‌కుమార్ పరిడకు వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

జయపురం: ప్రభుత్వ ఖాళీ భూముల్లో ఇల్లు కట్టుకునేందుకు తమకు స్థలాలు మంజూరు చేయాలని సమాజ సేవకుడు బి.హరిరావు నేతృత్వంలో వందలాది మంది విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం సబ్‌కలెక్టర్ ప్రభాత్‌కుమార్ పరిడకు వినతిపత్రం అందజేశారు. తామంతా జయపురం మునిసిపాలిటీ పరిధిలోని సతినది పరివాహక ప్రాంతంలో ఉంటున్నామని చెప్పారు. సుమారు 60 కుటుంబాలు పదేళ్లుగా పూరిగుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 10 న గొడియదొబా సాహి నుంచి ఓ వ్యక్తి వచ్చి భూమి తమదని, వెంటనే ఖాళీ చేయాలని చెప్పారని వివరించారు. 50 సెంట్ల డొంగరు భూమి అతడి పేరున ఉందంటున్నాడని, వాస్తవానికి ఆ ప్రాంతం ప్రభుత్వ స్థలమని గతంలో తాము అప్పర్ కొలాబ్ జలవిద్యుత్ ప్రాజెక్టు ఇరిగేషన్ విభాగ అధికారులను కలసినప్పుడు తెలిపారని పేర్కొన్నారు. ఇప్పుడు ఖాళీ చేయమంటే ఎక్కడికి పోవాలని వాపోయారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని, ఒకవేళ ఆ ప్రాంతం ఖాళీ చేయాల్సి వస్తే ప్రభుత్వ స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. విచారణ జరుపుతామని సబ్ కలెక్టర్ హామీఇచ్చారు. కార్యక్రమంలో అన్నపూర్ణ నాయిక్, ఉమా గొలారి, భగవతీ బొడొడియ, పంకజనీ ఖొర, పద్మిణీ ముదులి, నవీణ నాయక్, దమయంతి ముదులి, బొయిది మాలి, రొయిబారి మఝి, కుని సాగర్, గులిటి సాగర్, సాంబారు జాని, ప్రతిమా నాగ్, కమళా జాని, ముక్త మఝి తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగు లాభదాయకం



ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: తైల గింజల పంటల్లో పామాయిల్ ప్లాంటేషన్ లాభదాయకమైనదని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. శనివారం జయపురం పంచాయతీ సమితి అంతగ్రామ పంచాయతీ కలశహండి గ్రామంలో జయపురం ఉద్యాన వన విభాగం, కరశాల మహర్శి తేల్ వ్యక్తిగత సమితులు సంయుక్తంగా మేఘా పామాయిల్ ప్లాంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పామాయిల్ సాగు ద్వారా మంచి లాభాలు పొందవచ్చన్నారు. అన్ని నూనెలు కన్నా పామాయిల్ నూనె ప్రజలకు చౌకగా లభిస్తుందని చెప్పారు. ప్లాంటేషన్‌తో పాటు పామాయిల్ ప్రాసెసింగ్ మిల్లులను ఏర్పాటు చేయాలని, అప్పుడే రైతులకు లబ్ధి కలుగుతుందని తెలిపారు. కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పడాల్ మాట్లాడుతూ పామాయిల్ ప్లాంటేషన్ ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గున్నారు.

క్లుప్తంగా

రేపటితో ముగియనున్న ఇంజినీరింగ్ ఆప్షన్లు ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీ సెట్-2023 కౌన్సెలింగ్‌లో భాగంగా ఇంజినీరింగ్ (ఎంపీసీ)స్ట్రీం ఆప్షన్లు ఎంపిక ఈనెల 14తో ముగియనుంది. ఈ ప్రక్రియ ఈ నెల 7న ప్రారంభమైంది. ఎంపికలో సమస్యలు ఉన్న వారు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రానికి వస్తున్నారు. అధికారులు సమస్య పరిష్కరిస్తున్నారు. ఆప్షన్లు ఎంపిక ముగిశాక, 16న ఆప్షన్ల మార్పులకు సాంకేతిక విద్యాశాఖ అవకాశం కల్పించింది. విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలలు, బ్రాంచ్‌లు ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. ర్యాంకు, రిజర్వేషన్, రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు లభిస్తాయి.

డిగ్రీ విద్యార్థులకు ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గల బొల్లినేని మెడీస్కిల్స్‌లో ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్ ఆధ్వర్యంలో పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకు ఏదైనా డిగ్రీ లేదా పీజీ పాసై ఉండాలన్నారు. 20 నుంచి 28 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచితంగా వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. నిర్ణీత రుసుంతో ఎంహెచ్ఏ, పీజీ డిప్లమా ఇన్ మెడికల్ రికార్డ్స్ గ్యాస్ట్రో ఎంట్రలాజీ, క్రిటికల్ కేర్, ఎమర్జెన్సీ టెక్నాలజీ కోర్సుల్లో ఏయూ, ఆర్‌ఏయూతో కలిసి అడ్మిషన్లు జరుపుతున్నట్లు తెలిపారు. వివరాలకు 7680945357, 7995013422 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి: అధిక శ్రావణ బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా అరసవల్లి ఆదిత్యుని కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ ఈ ప్రక్రియను జరిపించారు. రూ.500 చెల్లించిన భక్తులు కల్యాణ సేవలో పాల్గొని కల్యాణ తలంబ్రాలను, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈఓ వి.హరిసూర్యప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర చెస్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు వేదికగా సాగిన రాష్ట్ర చెస్ పోరు ముగిసింది. ఏపీ రాష్ట్ర చెస్ అసోసియేషన్, సీఎస్ఎన్ ట్రస్ట్ సౌజన్యంతో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అరసవల్లి రోడ్‌లో ఉన్న ఇందిరా విజ్ఞాన్‌మందిరం వేదికగా మూడు రోజులపాటు హోరాహోరిగా జరిగిన ఏపీ రాష్ట్ర స్థాయి అండర్-11 బాలబాలికల చెస్ పోటీలు శనివారం సాయంత్రంతో ముగిశాయి. బాలుర విభాగంలో విజేతగా శామ్యూల్ (అనంతపురం) నిలవగా, రన్నరప్‌గా యతిన్ రెడ్డి (తిరుపతి), మూడోస్థానంలో అఖిల్ ప్రసాద్ (వైజాగ్) నిలిచారు. ఇక బాలికల విభాగంలో రిషిత (కృష్ణ జిల్లా) విజేతగా, ఆముక్త (ప్రకాశం) రన్నరప్‌గా, త్రిపురాంబిక (తిరుపతి) తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలకు బహుమతులు అందజేత.. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ చౌదరి బాబ్జి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు అక్టోబర్ ఒకటి నుంచి విశాఖపట్నం స్వర్ణ భారతి స్టేడియంలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని ఏపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.భీమారావు పేర్కొన్నారు.

విదేశీ విహంగం సురక్షితం



పలాస ఆర్టీసీ కాంప్లెక్సులో సురక్షితంగా ఉన్న పెలికాన్ పక్షి

కాశీబుగ్గ: రెక్కకు దెబ్బ తగిలి పలాస ఆర్టీసీ డిపోలో పడిపోయిన విదేశీ విహంగం ప్రస్తుతం సురక్షితంగా ఉంది. పక్షికి ఆర్టీసీ సిబ్బంది అవసరమైన సపర్యలు చేస్తున్నట్లు మేనేజర్ ఆర్.సీ తారామనాయుడు తెలిపారు. అయితే ఫారెస్టు అధికారులు గానీ, తేలినీలాపురం పక్షుల కేంద్రం నుంచైనా ఇంతవరకు ఎవ్వరూ రాలేదని అన్నారు.

టీచర్ పోస్టులకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మందసలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల (బాలికలు)లో ఖాళీగా ఉన్న టీజీటీ ఫిజికల్ సైన్స్ టీచర్ పోస్టు భర్తీకి మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఇంగ్లిష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కో ఆర్డినేటర్ ఎస్.బాలాజీ నాయక్ తెలిపారు. వాక్ ఇన్ ఇంటర్వ్యూ, డెమో ద్వారా గెస్ట్ ఉపాధ్యాయుల ఎంపిక ఈ నెల 14న మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళంలోని ఆదివారంపేట, ఏపీఎస్‌డబ్ల్యూ, ఆర్‌ఈఐ సొసైటీ, జిల్లా కో-ఆర్డినేటర్ కార్యాలయంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 08942 279926, 9701736862, 9000314209 నంబర్లను సంప్రదించాలని సూచించారు.






● పొలంబడిలో..

బాలికలు పొలం బాట పట్టారు. నాటు...నాటు నాటు అంటూ నాట్లు వేసే పనిలోకి దిగారు. పట్టణంలోని ఓ ప్రైవేటు విద్యాలయానికి చెందిన స్టూడెంట్లు ఎచ్చెర్ల మండలం పొన్నాడలో గ్రామానికి వెళ్లి అక్కడ జరుగుతున్న ఉభాలు పరిశీలించి పొలంలోకి దిగారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

చనిపోయినా బతికుందాం!

మట్టిలో కలిసిపోయే గుండె ఇంకో మనిషిని బతికించగలదు. మంటల్లో కాలిపోయే కళ్లు మరో బతుకులో వెలుగు నింపగలదు. ఆయువు తీరిన దేహం మరొకరి ఆయుష్షు రేఖను పెంచగలదు. ఇందుకు ఒకటే దారి.. అదే అవయవదానం. అంపశయ్యపై ఉన్న వారిని తలరాత మార్చాలన్నా.. చావు అంచుల్లో నించున్న వారిని తిరిగి బతుకు దారిలోకి తీసుకురావాలన్నా ఇదొక్కటే మార్గం. నేడు అవయవదాన దినోత్సవం. చనిపోయాక శరీర భాగాలను వృథా చేయడం కంటే మరో మనిషి కోసం వినియోగించడం మాధవ సేవ అని చెప్పే రోజు. అపోహలు వీడి ఓ చైతన్య కాగడాను ఊరూరా వెలిగించాల్సిన తేదీ ఇది.





శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో శరీర అవయవదానం చేసేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్న దాతలు

- ● అవయవదానంపై అపోహలు వీడాలి
- ● నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం

ఇచ్ఛాపురం రూరల్: మనిషి చనిపోయాక దేహంతో పాటే అవయవాలన్నీ మట్టిలోనే కలిసిపోతాయి. లేదా చితిలో కాలి బూడిదవుతాయి. అవే అవయవాలను దానం చేస్తే ఎన్నో కుటుంబాల్లో చిరునవ్వులు నింపవచ్చు. రోడ్డు ప్రమాదాల్లో బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారణ అయిన వారి నుంచి మాత్రమే అవయవాలను సేకరిస్తారు. బ్రెయిన్ డెడ్ కేసు అంటే మనిషి పూర్తిగా చనిపోయినట్లే లెక్క. సాధారణ మరణాల్లో నేత్రాలను తీసుకుంటారు.

నమోదు ఇలా

అవయవ దానం చేయాలనుకునే వారు ముందుగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, తమకు తెలిసినవారందరికీ సమాచారం అందివ్వాలి. దీని వల్ల అతను చనిపోయాక అవయవ దానం చేసేందుకు వీలు కలుగుతుంది. జీవన్‌దాన్ అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం 2014లో ప్రవేశపెట్టగా, రాష్ట్ర విభజన అనంతరం విజయవాడ కేంద్రంగా 2015 నుంచి తమ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ పథకం ద్వారా బ్రెయిన్‌డెడ్ కేసుల నుంచి అవయవాలు సేకరిస్తారు. 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ జీవన్‌దాన్ డాట్ జీవోవి డాట్ ఇన్' వెబ్ సైట్‌లో డోనర్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలి. నమోదు చేసుకున్నవారికి ప్రభుత్వం ఆర్గాన్ డోనార్ కార్డును అందజేస్తుంది.

అవయవాలు కావాల్సి వస్తే..

అవయవాలు కావాల్సిన రోగులు కూడా ప్రభుత్వ జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలి. వారికి సీరియల్ నంబర్ ఇస్తారు. అవయవ దానం చేసే కేసులు వచ్చినప్పుడు సీరియల్ నంబర్ ప్రకారం అవకాశం కల్పిస్తారు.

సజీవమూర్తి కిరణ్‌చంద్



సోంపేట పట్టణం గీతా మందిరం కాలనీకి చెందిన మల్లారెడ్డి మోహన్, గిరిజా కల్యాణిల ఒక్కగానొక్క కుమారుడు కిరణ్‌చంద్(16) స్ఫూర్తి అనన్యసామాన్యం. 2023 ఏప్రిల్ 15న కిరణ్‌చంద్ అనారోగ్యానికి గురయ్యాడు. మెదడులో సమస్య వచ్చిందని, విశాఖపట్నం వెళ్లాలని వైద్యులు సూచించడంతో హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి రాగోలు జెమ్స్ ఆస్పత్రికి మార్చారు. వారం రోజుల అనంతరం పరిస్థితి విషమించడంతో వైద్యులు, ఆర్గాన్ డొనేషన్ సమన్వయకర్తలు తల్లిదండ్రులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. గుండె, కిడ్నీలు, లివర్, కళ్లను దానం చేయడం ద్వారా మరొకరి రూపంలో కిరణ్ సజీవంగా ఉంటాడని కుమారుని అవయవాలు దానం చేసేందుకు తల్లిదండ్రులు ఒప్పుకోవడంతో ఏప్రిల్ 23న అవయవదానాల తంతును పూర్తి చేశారు.

8 మంది జీవితాల్లో 'చంద్ర'కాంతులు



జి.సిగడాం మండలం మధుపాం గ్రామానికి చెందిన పట్నాన చంద్రకళ(32) సీఏ ఫ్‌గా పనిచేసేవారు. ఈ ఏడాది మే 30న తలనొప్పితో బాధపడుతూ శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆమెను విశాఖ విమ్స్ ఆస్పత్రికి తరలించారు. చంద్రకళ తలలో నరాలు చిట్లిపోయి రక్తస్రావం అయినట్లు గుర్తించారు. దీంతో బ్రెయిన్‌డెడ్ అయిందని, ఈమె అవయవాలను ఇతరులకు దానం చేసి వారి జీవితాలకు నూతన వెలుగులు ప్రసాదించాలని వైద్యులు కుటుంబ సభ్యులను సూచించారు. భర్త శివను, ఇద్దరు కుమార్తెలను ఒప్పించడంతో జూన్1న అవయవదానం చేసి ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపారు.

ఏయే అవయవాలు దానం చేయవచ్చు

మనిషి మరణానంతరం కళ్లు, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, లివర్, జీర్ణ వ్యవస్థలోని ప్యాంక్రియాస్, పేగులు దానం చేయవచ్చు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడి తలకు రక్త సరఫరా నిలిచిపోవడంతో బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారణ అయిన వారి నుంచి మాత్రమే అవయవాలను సేకరిస్తారు.

ఇతరులకు ఉపయోగపడదాం



చనిపోయాక కూడా ఇతరుల జీవితాల్లో వెలుగు నింపి మరోసారి జీవించే అవకాశం అవయవదానం కల్పిస్తుంది. అవయవ దానాన్ని మించిన దానం మరొకటి లేదు. అత్యవసర సమయాల్లో దాతలు లేక ఎంతో మంది మృత్యువాత పడుతున్నారు. మరణించాక మన అవయవాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో మా దంపతులం శరీర అవయవదానం చేసేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. – మిస్కా కళావతి, కృష్ణయ్య , ప్రభుత్వ ఉపాధ్యాయులు

భర్త మాట కోసం



ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి పంచాయతీ అయ్యవారిపేటకు చెందిన కృష్ణచంద్ర రాణో ప్రైవేటు బస్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. 2015 మార్చి నెలలో ప్రమాదవశాత్తు వంతెన మెట్లపై నుంచి జారిపడటంతో కోమాలోకి వెళ్లిపోయాడు. బతికే సూచనలు లేవంటూ వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు హతాశుతులైపోయారు. విశాఖపట్నం న్యూకేర్ ఆస్పత్రిలో అవయవ దానం చేసేందుకు భార్య శారదా రాణో అంగీకరించడంతో కళ్లు, గుండెతో పాటు కిడ్నీలను దానం చేశారు. ఆ అవయవాలు ముగ్గురికి కొత్త జీవితాన్ని ఇచ్చాయి. అందుకే ఆయన నేటికి సజీవంగా ఉన్నాడని విశ్వసిస్తున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.

'హోంగార్డులకు 300 రెయిన్ కోట్లు'



హోంగార్డులకు రెయిన్‌కోట్స్ అందజేస్తున్న ఎస్పీ రాధిక, డాక్టర్ దానేటి శ్రీధర్

శ్రీకాకుళం క్రైమ్: పోలీసులకు తన చారిటబుల్ ట్రస్టు ద్వారా డాక్టర్ దానేటి శ్రీధర్ అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎస్పీ జీఆర్ రాధిక కొనియాడారు. జిల్లాలోని హోంగార్డులకు ట్రస్టు తరఫున 300 రెయిన్‌కోట్లను శనివారం ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవలే ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించి ఎన్నో సేవా కార్యక్రమాలు డాక్టర్ చేస్తున్నారని, అదే విధంగా పోలీసు శాఖకు మీ వంతు సహకారం కావాలని కోరిన వెంటనే స్పందించి వర్షాకాలంలో ఉపయోగపడేలా 300 రెయిన్‌కోట్స్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. అలాగే ఆర్థిక స్థోమత లేని హోంగార్డుల పిల్లలు చదువుల కోసం కూడా సాయం చేయడానికి ఆయన అందుబాటులో ఉంటారని చెప్పారు. డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ ఎస్పీ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. హోంగార్డులకు తనవంతు సహకారంగా రెయిన్‌కోట్స్ అందించానని, ఇక నుంచి ఏటా రూ.20 లక్షల వరకు హోంగార్డు పిల్లల ఉన్నత చదువులకు కేటాయిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి, డీఎస్పీలు ఎస్.వాసుదేవ్ , వై.శృతి, డి.ప్రసాదరావు, ఆర్ఐ ఉమామహేశ్వరరావు, హోంగార్డులు పాల్గొన్నారు.

● మువ్వన్నెల వెన్నెల



స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఇంటింటా మూడు రంగుల జెండా రెపరెపలాడనుంది. అరసవల్లిలో శనివారం 'హర్ ఘర్ తిరంగ్-2.0'లో నిర్వహించారు. ఈస్ట్ సబ్‌డివిజన్ (పోస్టు) పర్యవేక్షకులు బి.చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ సమక్షంలో జాతీయ జెండాల విక్రయాలను చేపట్టారు. కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. – అరసవల్లి

విదేశాలకు పార్సిళ్లు ఇక సులభం

- ● తపాలా కార్యాలయాల ద్వారా విదేశాలకు పార్సిల్ సౌకర్యం
- ● కేంద్రం విడుదల చేసిన తొలి జాబితాలో శ్రీకాకుళం, ప్రధాన తపాలా కార్యాలయానికి చోటు
- ● సెప్టెంబర్ మొదటి వారం నుంచి ప్రారంభమయ్యే అవకాశం

శ్రీకాకుళం: శ్రీకాకుళం నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయం నుంచి విదేశాలకు పార్సిళ్లు పంపించే సదుపాయం త్వరలోనే అందుబాటులోకి రానుంది. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది పైలెట్ ప్రాజెక్టుగా దేశంలోని కొన్ని తపాలా కార్యాలయాల నుంచి విదేశాలకు పార్సిల్ పంపించే సౌకర్యాన్ని కల్పించింది. అక్కడ విజయవంతం కావడంతో తాజాగా దేశంలోని మరో 715 తపాలా కార్యాలయాలకు ఈ అవకాశం కల్పించారు. మన రాష్ట్రం నుంచి 24 పోస్టు కార్యాలయాలను ఎంపిక చేయగా అందులో శ్రీకాకుళం నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయానికి అవకాశం లభించింది. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఈ సౌకర్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలోని 8 నుంచి 10 శాతం మంది విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరికి ఏమైనా పంపించాలంటే ప్రైవేట్ కొరియర్ల ద్వారా వ్యయ ప్రయాసతో పార్సిళ్లు పంపించేవారు.

పోస్టు కార్యాలయాల్లో ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తే తక్కువ ధరకే విదేశాలకు పార్సిల్ పంపించే అవకాశం ఉంటుంది. 715 తపాలా కార్యాలయాల్లో ఈ ప్రాజెక్టు విజయవంతం అయితే ప్రధాన పట్టణాలు, నగరాల్లోని అన్ని పోస్టాఫీసుల్లోను ఈ సౌలభ్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వ యోచిస్తోంది.

క్వారీ ప్రమాదంలో ఆపరేటర్ మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన రమణమూర్తి



పొక్లెయినర్ క్యాబిన్‌పై పడిన గ్రానైట్ బ్లాక్

టెక్కలి రూరల్: మండలంలోని మేఘవరం పంచాయతీ పరిధి నువ్వుగుడ్డి గ్రామ సమీపంలో గల వీఆర్‌పీ గ్రానైట్ క్వారీలో శనివారం జరిగిన ప్రమాదంలో క్వారీలో పొక్లెయినర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న గంగు రమణమూర్తి(45) మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోటబొమ్మాళి మండలం గంగుపేట గ్రామానికి చెందిన రమణమూర్తి శనివారం క్వారీలో రాక్ కటింగ్ చేసిన అనంతరం ఆ రాయిని బయటకు తీస్తుండగా రాయి పట్టుజారి ఒక్కసారిగా పొక్లెయినర్ క్యాబిన్‌పై పడింది. దీంతో రమణమూర్తి క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. అక్కడున్న వారు చాలాసేపు తీవ్రంగా శ్రమించి అతడిని బయ టకు తీసి హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతని కాళ్లు నుజ్జునుజ్జైపోయాయి. చికిత్స చేస్తుండగానే అతడు మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. కుటుంబ సభ్యు లకు సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి వచ్చి గుండెలవిసేలా రోదించారు. విషయం తెలు సుకున్న టెక్కలి ఎస్ఐ రామకృష్ణ ముందుగా ఆస్పత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం క్వారీకి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతునికి భార్య సరళ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. క్వారీల్లో సరైన భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని అందుకే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

అనుమతులు లేని విద్యాలయాలపై క్రిమినల్ కేసులు

- ● ఆర్‌ఐఓకు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశం

శ్రీకాకుళం:

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ గుర్తింపు లేకుండా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. కొద్ది రోజుల కిందట బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె.అప్పారావుకు ఓ విద్యార్థి తల్లిదండ్రులు నారాయణ విద్యా సంస్థలు తమ కుమారుడికి టీసీ ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన సంబంధిత సంస్థ ప్రతినిధికి ఫోన్ చేసి మాట్లాడగా.. వారు పట్టించుకోలేదు. శుక్రవారం మరోసారి ఫోన్ చేస్తే పరుష పదజాలంతో దూషించారు. దీంతో ఆయన కమిషన్ సభ్యులతో కలిసి శ్రీకాకుళంలోని 80 అడుగులు రోడ్డులో ఉన్న నారాయణ విద్యా సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాలకు అనుమతి లేకపోయినా కోచింగ్ సెంటర్ పేరిట రెగ్యులర్ తర గతులు నిర్వహిస్తున్నట్లు బయటపడింది. తరగతి గదుల్లో సీసీ కెమెరాలు ఉండడాన్ని కమిషన్ తప్పు పట్టింది. మౌలిక వసతులు కూడా లేకపోవడాన్ని కమిషన్ సభ్యులు గమనించారు. ఆగస్టు నెలాఖరులోగా అనుమతి పొందాలని అలా కాకుంటే కళాశాలను సీజ్ చేస్తామని చైర్మన్ హెచ్చరించారు.



అనుమతి లేకుంటా నిర్వహిస్తున్న నారాయణ కళాశాల

ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించినా, ప్రభుత్వ, బోర్డు నిబంధనలు పాటించపోయినా, అనుమతులు లేకపోయినా అలాంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటాం. విద్యా సంస్థ ప్రతినిధి మమ్మల్ని పరుష పదజాలంతో దూషించటం వాస్తవమే. మా ఆదేశాలను కూడా నారాయణ విద్యా సంస్థల ప్రతినిధి ధిక్కరించారు. మా పరిస్థితే ఇలా ఉంటే.. సాధారణ తల్లిదండ్రుల పరిస్థితి ఊహించుకోవచ్చు.

– కేసరి అప్పారావు, బాలల హక్కుల సంరక్షణ కమిటీ చైర్మన్

అలరించిన సంపూర్ణ శతావధానం



అవధాన ప్రక్రియలో పాల్గొన్న కవిపండితులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో జరుగుతున్న 'అవధాన పద్మాకరం-సంపూర్ణ శతావధానం' రెండో రోజు శనివారం జరిగిన ప్రక్రియ అలరించింది. ఈ సందర్భంగా పద్మాకర్ గాయత్రీ మాత, ఉగ్రనరసింహం, కుశాలపురం, సతివాడ, పోలమ్మ, సుమిత్రా కళాసమితి పై పద్యాలను చెప్పారు. మరో అ వధాని బులుసు అపర్ణ మాట్లాడుతూ సుమిత్రా కళాసమితి అద్భుతమైన అవధాన ప్రక్రియ చేపట్టడం అభినందనీయమన్నారు. మరో అవధాని తాతా సందీప్ శర్మ మాట్లాడుతూ అవధాన సాహిత్య ప్రక్రియ నిర్వహించి శ్రీకాకుళాన్ని అవధాన వేదికగా మార్చారని అభినందించారు. అవధాన ప్రక్రియ ఈరోజుతో ముగిసిందని నిర్వాహకులు డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు తెలిపారు.

వాహనాల దొంగల ముఠా పట్టివేత

కొత్తూరు: వాహన దొంగల ముఠాను కొత్తూరు ఎస్ఐ ఎం.గోవింద తన సిబ్బందితో శనివారం పట్టుకున్నారు. కొత్తూరు నాలుగు రోడ్ల కూడలిలో ఆయన తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో కొత్తూరు మండలం గురండి గ్రామానికి చెందిన అలికాన వంశి, పాగోటి వినయ్, ఒక మైనర్ బాలుడులు వాహనంతో దొరికారు. వీరు తీరు అనుమానాస్పదంగా ఉండడంతో వీరిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా.. వాహనాలు దొంగిలించినట్లు ఒప్పుకుని వివరాలన్నీ చెప్పేశారు. ఒడిశా రాష్ట్రం కిడిగాం, సీతాపురంతో పాటు పలు గ్రామాల్లో మూడు బైక్‌లు, ఒక లగేజి ఆటో, సర్వీస్ ఆటోలు దొంగలించినట్లు చెప్పారు. అలాగే హిరమండలం మండలంలో 3, జలుమూరు మండలంలో 1, భామిని మండలం బత్తిలి గ్రామంలో ఒకటి, కొత్తూరు మండలం సోమరాజపురంలో 1 చొప్పున బైక్‌లు దొంగలించినట్లు చెప్పారు. ఆ వాహనాలను విక్రయించిన వారి వివరాలు చెప్పడంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి వాటిని ఆరు గంటల్లోనే రికవరీ చేశారు. ముఠా దొంగిలించిన రెండు ఆటోలు, ఒక బులెట్, 9 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఏ1 ముద్దాయిగా ఉన్న అలికాన వంశీ మండలలోని మెట్టూరు సెంటర్‌లో చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. ఏ2 పాగోటి వినయ్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు, మైనర్ బాలుడు మెట్టూరులో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ముగ్గురూ ఒక గుంపుగా ఏర్పడి వారికి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో బైక్‌ల తాళాలు తీసి దొంగలిస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.